

28న ఆర్ట్స్ కళాశాల్లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మార్చి 28న ఉదయం 9.00 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ వద్ద మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభి వద్ధి అధికారి ఎం.కొండలరావు, జెడి ఎం.కేశవ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో వివిధ ఉద్యోగాల్లో పని చేసేందుకు పిజి, బి.టెక్, ఫార్మసీ, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసి 19 నుంచి 29 ఏళ్ల వయసు గల వారు అర్హులని చెప్పారు. తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా తమ పూర్తి వివరాలతో shorturl.at/hoFJUలో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 8919868419, 9581810049 ఫోన్ నంబరల్లో సంప్రదించాలని తెలిపారు.

జెడ్‌పి పాఠశాలలో వసతుల కరువు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 730 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. బాలికలు 344 మంది ఉండగా, బాలురు 386 మంది ఉన్నారు. వీరికి మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరుగుదొడ్ల కొరత, ఉన్న మరుగుదొడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో బాలికలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైస్కూల్ కాంపౌండ్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు కూడా వీటినే వినియోగించడంతో తగిన వసతులు లేక తీవ్ర అవస్థలు గురవుతున్నారు. అనేక సంవత్సరాల నుంచి బాలురకు మరుగుదొడ్లు వసతులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వారు చెరువుల వద్దకు, పొలాలలోకు వెళ్లి కాలకత్యాలు తీర్చుకుంటున్నారని ఆవేదన చెందారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాల కత్యాలు తీర్చుకునేందుకు చెరువులను, పొలాలను ఆశ్రయిస్తున్నామని వారు చెబుతున్నారు. బాలుర్లకు మరుగుదొడ్లు లేకపోవడంపై చాలా తీవ్ర సమస్య ఎప్పటినుండో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అగ్రహం వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో చెరువుల వద్దకు లేక దూర ప్రాంతాలకు పొలాలలోకి వెళ్లి సమస్యను పరిష్కరించుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహాయంతో 2017లో హైస్కూల్‌కు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు మంచినీరు అందించిన దాఖలాలే లేవని తల్లిదండ్రులు అంటున్నారు. ప్లాంట్ అసలు వినియోగంలోనే లేదని చెబుతున్నారు. సత్య సాయి బాబా మంచినీరు హైస్కూల్‌కు వచ్చేదని, అది కూడా సుమారు అనేక ఏడాదిన్నర నుంచి రావడం లేదంటున్నారు. దీంతో పంచాయతీ నీళ్లనే తాగుతున్నారు. ఆ నీరు తాగడం ద్వారా అనేక సమస్యలు వస్తున్నాయని ఆవేదన చెందారు. కొంతమంది విద్యార్థిని విద్యార్థులు ఇంటి వద్ద నుండి వాటర్ బాటిల్‌లు తెచ్చుకుంటున్నప్పటికీ అని సరిపోకపోవడంతో పంచాయతీ నీరునే తాగుతున్నామని చెప్పారు.

పాఠశాల ఆవరణలో 2020లో రూ.కోటీ 20 లక్షల నాబార్డు నిధులతో ఆరు తరగతి గదులు కట్టేందుకు పనులు మొదలు పెట్టారు. కొత్త తరగతి గదులు నిర్మించేందుకు పాడుబడిన తరగతు గదులను తొలగించారు. తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నేటికీ ఆ తరగతి గదుల నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ఆ పనులు నత్తనడక నడుస్తున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఆ గదుల్లోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. సుమారు 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. నాబార్డు ద్వారా నిధులు సక్రమంగా రాకపోవడంతో పనులు నత్తనడకు నడుస్తున్నాయంటున్నారు. అదనపు తరగతి గదులతో పాటు బాలికలకు 10 టాయిలెట్స్ కడుతున్నట్లు తెలిపారు. నాబార్డ్ నిధులతో కడుతున్న బాలికల టాయిలెట్స్ పూర్తి చేస్తే బాలికలకు కొంతమేర సమస్య తీరుతుంది. బాలురులకు కూడా టాయిలెట్స్ కట్టాలని కోరుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించి మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, అదనపు తరగతి గదులు నిర్మాణం పనులు పూర్తి చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరారు.



గోపాలపురం జెడ్‌పి హైస్కూల్



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము

హైస్కూల్లో దాతలు ఇచ్చిన మినరల్ వాటర్ ప్లాంట్ రిపేర్‌లో ఉంది. నాబార్డు నిధుల ద్వారా బాలికలకు నిర్మిస్తున్న పది టాయిలెట్స్ చివరి దశలో ఉన్నాయి. బాలురకు టాయిలెట్స్ అసలు లేవు. బాలుర టాయిలెట్స్ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాము. సుమారు రెండేళ్ల నుంచి స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్స్ రావడం లేదు. దీంతో కరెంటు బిల్లులు, స్టేషనరీ, ఇతర ఖర్చులు సొంతంగా పెడుతున్నాము. మినరల్ వాటర్ ప్లాంట్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాము.

- సోమశేఖర్, హెచ్ఎం, జెడ్‌పి హైస్కూల్.



మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంట్



అసంపూర్తిగా ఉన్న తరగతి గదిలోనే విద్యార్థులు

యూనిఫారం, సామగ్రి కోసం వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మున్సిపల్ కార్పొరేషన్‌లో గార్డెనర్స్, రోడ్ మజ్దూర్ వర్కర్స్‌కు యూనిఫామ్, జోళ్లు, టవల్స్ ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ గార్డెనర్స్ అండ్ రోడ్ మజ్దూర్ వర్కర్స్ సమస్యలపై సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, వివరించారు. 30 ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న గార్డెనర్స్‌కు యూనిఫామ్స్, జోళ్లు, టవల్స్ ఇప్పించమని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యాదర్శులు ఎన్.సత్యన్నారాయణ, పెంకే కృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, కోశాధికారి ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరమణ, నాగేశ్వరరావు, అప్పారావు, సూర్యనారాయణ, పోసుబాబు, సాల్మన్‌రాజు, పోతురాజు, సుబ్బారావు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

రేపు విఆర్‌ఒల సంఘం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

విఆర్‌ఒల సంఘం జిల్లా ప్రథమ సర్వసభ్య సమావేశం ఈనెల 26న ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్..సొంగరాజు తెలిపారు. కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని గ్రామాల విఆర్‌ఒలు విధిగా హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి అన్నారు. శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ఎన్‌జిఒ సంస్థల ప్రతినిధులు సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో సంబంధిత ప్రభుత్వ కార్యనిర్వాహక విభాగాలతో సమన్వయంగా ఎలా పని చేయాలో వారికి వివరించారు. సమస్యలకు పరిష్కారం దొరకని పక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దష్టికి తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం ఒక బాధితునికి ఎపి విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్‌లో రూ.రెండు లక్షల పరిహారాన్ని ఆమె అందజేశారు. అనంతరం జరిగిన యుఆర్‌టిసి సమావేశంలో న్యాయమూర్తులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొని విచారణలో ఉన్న ఖైదీల కేసుల్లో దర్యాప్తు, ఛార్జిషీట్ ఫైల్ చేసే విషయాలలో పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.



బాధితునికి సాయం అందిస్తున్న జడ్జి ప్రత్యూషకుమారి

టిడిపి శ్రేణుల విజయోత్సవాలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో టిడిపి ఆధ్వర్యాన శుక్రవారం పలుచోట్ల సంబరాలు జరిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

నిడదవోలులో టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుని విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పేరూరి సాయిబాబా, తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షులు ఎస్‌కె.బాబు, మాజీ కౌన్సిలర్ కైకరపు సత్యనారాయణ, వాకలపూడి వెంకట రత్నం, గుడ్ల బుజ్జి, కొండపల్లి నరేష్, మండలి కిషోర్, మద్దుకూరి శ్రీనివాస్, మద్దుకూరి రాధా, గజ్జరపు శ్రీనివాస్, భోగిరెడ్డి రామ కృష్ణ, కె.లీలా కుమార్, సుంకవల్లి శ్రీధర్, హరిదాసు కాశీ, హరిదాసు వెంకటేశులు, గుండాల మునియ్య, బెల్లంకొండ శ్రీను, పంపా ధన రాజు, దావీదు, వై.శీను, గారపాటి హరి, శెట్టే రామారావు, మట్టా వెంకట్రావు, కోడికోట సత్యం, ఉప్పల సాంబశివ రావు, ఈతకోట రాజు పాల్గొన్నారు. **గోకవరం** అభ్యర్థిని కంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల శుక్రవారం మండల టిడిపి అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ గోకవరం గ్రామపంచాయతీ నుంచి దేవీచౌక్ మీదుగా తహశీల్దారు కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ టిడిపికి విజయం చేకూర్చడం రాష్ట్రానికి శుభ పరిణామన్నారు. **గోపాలపురంలో** నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎంఎల్‌ఎ వంగలపూడి అనిత పుట్టినరోజు వేడుకను టిడిపి మండల మహిళా నాయకురాలు ఆలపాటి దుర్గాభవాని భారీ కేక్ కట్ చేసి స్వీట్ పంచారు. **రాజానగరంలో** మాజీ ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యాన బైకు ర్యాలీ నిర్వహించారు. సూర్యారావుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నిడదవోలులో టిడిపి నాయకుల సంబరాలు

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-పెరవలి, గోకవరం

పెరవలి ఐసిడిసి ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సిడిపిఒ శ్రీలక్ష్మి తెలిపారు కానూరు, ఉండ్రాజవరం, ఖండవల్లి, మోర్త, సూర్యారావుపాలెం, వేలివెన్ను, కాల్దారిలో పోస్టులకు అర్హత గల మహిళా అభ్యర్థులు 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు ఫారాలను ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గోకవరం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరుకొండ ఐసిడిఎస్ సిడిపిఒ ఝాన్సీరాణి తెలిపారు. గోకవరం మండలంలో గుమ్మళ్లదొడ్డి, గోకవరంలో పోస్టులకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాయుడు, పవన్, జ్యోతికి అవార్డులు

ప్రజాశక్తి- గోకవరం, పెరవలి

ప్రపంచ టిబి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు సిహెచ్‌సి నుంచి ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు, హెల్త్ అసిస్టెంట్ జి.పవన్ అవార్డులు అందుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఒ తూర్పుగోదావరి జిల్లా టిబి అధికారి డాక్టర్ వసుంధర ద్వారా ప్రశంశాపత్రం అందుకున్నట్లు సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర తెలిపారు. వీరిని పలువురు అధికారులు అభినందించారు. పెరవలి మండలం కానురులోని పిహెచ్‌సిక్షయ నివారణ విభాగం సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వి.ఆశాజ్యోతి ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్నారు.

ముక్కామలలో అన్నదానం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ముక్కామల తూము సెంటర్ ఏరియాలో శ్రీవినాయక శెట్టిబలిజ సేవా సంఘం, దానేశ్వరి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో నల్లాకులవారిపాలెం, బొక్కవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి తదితర గ్రామాల నుండి సుమారు 2000 మంది పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-తాళ్లపూడి

శృంగవృక్షం గ్రామంలో దళిత యువకుడు నడిపల్లి రాము హత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత నాయకులు పిట్టా రాము డిమాండ్ చేశారు. అన్నదేవరపేట గ్రామ బస్టాండ్ వద్ద శుక్రవారం దళిత సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఈ సంఘటనలో మతుని కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ తెలిపారు. మండలవ్యాప్తంగా సుమారు 12 వేల పశువులకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువుల్లో వైరస్ ద్వారా వ్యాప్తి చెంది వ్యాధి సోకిన పశువులు బలహీన పడడం, 104-108 డిగ్రీల జ్వరంతో నోరు, నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేత మేయకపోవడం, చొంగ కార్చడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నాలుగు నెలల వయస్సు దాటిన పశువులకు టీకాలు వేయించాలని కావున ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా క్షయ నివారణ వారోత్సవాలు

ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పుర్సస్కరించుకుని శుక్రవారం పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దానవాయిపేటలోని ఎస్‌కెవిటి స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోగినేని రత్నాకర్ రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యమానికి రెడ్ క్రాస్ ఎంసీ సభ్యుడు, న్యాయవాది గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు, జిల్లా అధ్యక్షులు వై.మధుసూదనరెడ్డి, కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుని బాధ్యతగల పౌరునిగా పాల్గొని సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీ సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రమేష్ బాబు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విజయకుమారి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మహా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం ఈ సందర్భంగా స్థానిక వై జంక్షన్ నుంచి శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రవం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దగ్గు క్రమం తప్పక రెండు వారాల వరకు ఉంటే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు వాడడం ప్రారంభించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ మొదలు మందులు వాడితే 6 నెలల్లో తగ్గిపోతుందని పేర్కొన్నారు. జిల్లా క్ష్యయవ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.వసుందర, లయన్స్ మహిళా క్లబ్ కార్యదర్శి కొయ్యా కమారి, డాక్టర్ కిరణ్, డాక్టర్ చందన ప్రియ పాల్గొన్నారు. **నల్లజర్లలో** ప్రభుత్వాసుపత్రి వైద్య ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు. ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కలిదిండి వెంకట చంద్రశేఖరరాజు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. **దేవరపల్లి** పంచాయతీ వద్ద క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఎంపిపి కెవికె.దుర్గారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నివారణ కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడిమి వీర కుమారి, పంచాయతీ కార్యదర్శి ఎన్.కిషోర్ పాల్గొన్నారు



దేవరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



రాజమహేంద్రవరంలో నిర్వహించిన అవగాహన సమావేశం

నేడు మహిళల ఖాతాలకు 'ఆసరా'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మహిళలకు మూడోవ విడత ఆసరా పథకాన్ని శనివారం వారి బ్యాంకు ఖాతాలకు సొమ్మును ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించే బహిరంగ సభలో మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారని తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 3వ విడత ఆసరా 32,491 స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులకు రూ.276.33 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొదటి విడతగా 32,313 ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రూ.274.90 కోట్లు, 2021-22లో రెండవ విడతగా 32,513 గ్రూపులకు రూ.278.22 కోట్లు జమ చేసినట్టు చెప్పారు.

కార్టూ'నిజం'



పొరపాటు సార్ అది
అనుకూల శాతం అనుకుంటా..!!



మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన చేస్తున్న నాయకులు

మద్యం దుకాణం వద్దని అందోళన

ప్రజాశక్తి-నిడదవోలు

నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రి పక్కన మద్యం దుకాణానికి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండే హాస్పిటల్స్, బస్ స్టాండ్ దగ్గర మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని రాంబాబు ప్రశ్నించారు. నిబంధనలకు విర్ధుంగా అనుమతులు ఇచ్చిన దుకాణాన్ని వెంటనే తొలగించకపోతే ప్రజలే తొలగిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాని, లెనిన్, నాగేంద్ర యువకులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు

ప్రజాశక్తి-రాజానగరం

బిజెపి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని ఎపి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ అన్నారు. రాజానగరంలో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందన్నారు. దీన్ని ప్రశ్నించినవారిపై తప్పుడు కేసులు పెట్టి భయపెడుతున్నారని చెప్పారు. గాంధీ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ ఎప్పుడూ కేసులకు భయపడే వ్యక్తి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వడియార్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎ.శేషగిరిరావు, ముప్పుడి శ్రీను పాల్గొన్నారు.



మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు



శ్రీరాంపురంలో క్లూస్ టీమ్‌తో గాలిస్తున్న పోలీసులు

దుర్గాంబిక ఆలయంలో 80 కాసుల బంగారం అపహరణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

శ్రీరాంపురం గ్రామంలో ఉన్న దుర్గాంబిక ఆలయంలో సుమారు 80 కాసుల ఆలయ ఆభరణాలు శుక్రవారం చోరీకి గురైనట్లు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. అమ్మవారి కిరీటం, మంగళ సూత్రం, చేతి హస్తం, హుండీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. దొంగిలించిన హుండీని గ్రామ శివారులో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారిలో రోడ్డు దాటుతుండగా వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలయినట్లు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల రామకృష్ణ మురారి సెంటర్లో బస్సు కోసం వేచి చూస్తూ వాటర్ బాటిల్ కొనడానికి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో రాజమండ్రి వైపు నుండి గండేపల్లి వైపుకు మోటార్ సైకిలు నిర్లక్ష్యంగా నడుపుతున్న వ్యక్తి రామకృష్ణను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. అతనిని కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రామకృష్ణ చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో స్థానిక బైపాస్ రోడ్ బల్లా ట్రేడ్ సెంటర్ భవనం వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మతదేహం శుక్రవారం లభ్యమైందని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. 60 నుండి 65 సంవత్సరాల మధ్య వయసు, తెలుపు రంగు, ఐదున్నర అడుగుల ఎత్తు ఉంటుందని ఆమెను గుర్తుపట్టినవారు యానాం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ శేరు నూకరాజు కోరారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం నీలపల్లి గ్రామానికి చెందిన మల్లాడి మల్లాడి బాబి అన్న యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. నీలపల్లిలోని స్థానిక చెక్ పోస్ట్ సెంటర్‌కు చెందిన బాబీ తండ్రి మృతి చెందడంతో వేటకు వెళ్లి తానే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే డ్రగ్స్ , మద్యానికి బానిసైన బాబి గత పది రోజులుగా ఎక్కువగా మద్యం సేవిస్తుండడంతో తల్లి మందలించింది. తల్లి బయటకు వెళ్లిన సమయంలో ఇంటి దూలానికి ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీవాస్ కుమార్ తెలిపారు.

యానాం వార్తలు



కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగులు

వోచర్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- కుటుంబ సభ్యులతో కలిసి సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - యానాం

యానాం పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రజా పనుల శాఖలో పనిచేస్తున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగులు తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరిలో తమ భార్య పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో యానాం పిడబ్ల్యుడి కార్యాలయం వద్ద గత కొన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్న సిబ్బంది శుక్రవారం తమ కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి నిరసన తెలియజేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన రూ.15వేల జీతానికి అదనంగా రూ.3వేలు పెంచి రూ.18వేల జీతం ఇవ్వాలని, డైలీ రేటెడ్ చేయాలని, ఆ శాఖలో ఖాళీగా ఉన్న ఎంటిఎస్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఓచర్ పెయిడ్ ఉద్యోగులు కుటుంబ సభ్యులు వారి పిల్లలు పాల్గొన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

రీజెన్సీ ఫ్యాక్టరీ తెరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ఎంఎల్ఎ

యానాంలో మూతబడిన వేలాది మందికి ఉపాధి కల్పించిన రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీని తెరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. సముద్రంలో ఓఎన్ జిసి సంస్థ రెండవ గ్యాస్ పైపులైను వేస్తున్న నేపథ్యంలో వేట నష్టపోతున్న యానాం మత్స్యకారులకు రావాల్సిన పరిహారం ఆలస్యం కావడంపై పుదుచ్చేరి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ సమాధానమిస్తూ యానాం ప్రాంత మత్స్యకారులకు సంబంధిత ఓఎన్‌జిసి సంస్థ నష్టపరిహారానికి సంబంధించి జిఒ ఈ ఏడాది ఫిబ్రవరి 15న జారీచేసిందన్నారు. పరిహారానికి మొత్తం 6,667 మంది దరఖాస్తు చేసుకున్నారని ఈ నేపథ్యంలో లబ్దిదారుల దరఖాస్తుల పరిశీలనకు విలేజ్ విల్కెమీటీలను నియమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆయా విలేజ్ లెవిల్ కమిటీల ద్వారా 50 శాతం విచారణ పూర్తయ్యిందన్నారు. మిగతా దరఖాస్తులు సైతం తనిఖీ చేసి దరఖాస్తుదా రులకు పరిహారాన్ని ఆయా లబ్దిదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. యానాంలో ఏళ్లతరబడి ఖాళీగా ఉన్న ఫిషరీస్ డైరెక్టర్ పోస్టు తదితరవాటిని భర్తీ చేయాలని ఎంఎల్ఎ అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూరప్రాంత విద్యార్థుల కోసం క్యాంటిన్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనభ్యర్థులకు మధ్యాహ్న పథకంను అక్షయపాత్ర ద్వారా ఇప్పటికే పుదుచ్చేరిలో అమలు చేస్తున్నారని యానాంలో అన్ని పాఠశాలల్లో అక్షయ పాత్ర పథకంను అమలు చేయాలని ఎంఎల్ఎ అశోక్ కోరారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, డిడి రవిశంకర్

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

యానాం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు యానాం ప్రధాన వీధులలలో ర్యాలీ నిర్వహించి క్షయ వ్యాధి నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్లు క్షయ వ్యాధి లక్షణాలను వివరిస్తూ, నివారణకై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి డి.రవిశంకర్, ఎడి సన్యాల్, వేణు గోపాల్ రాజు,ఖాన్,ఆశా వర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా పిసిఎస్ అధికారి గోయల్

యానాం నియోజకవర్గంలో గవర్నర్ ఆదేశాల మేరకు నూతన మున్సిపల్ కమిషనర్‌గా పిసిఎస్ క్యాడర్ అధికారి ద్విజ్ గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21న అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రస్తుత కమిషనర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్, సిఎం రంగసామి, స్పీకర్ సెల్వంలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి విపత్తులపై నేడు మాక్ డ్రిల్

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై శనివారం స్థానిక బీచ్ రోడ్ లో భారత్ మాత విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ ఏ ఓ మునిస్వామి ఆరోగ్య,ఫైర్, పోలీస్,ఎన్డిఆర్ఎఫ్ తదితర సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 2వ వార్డు పరిధిలోని బొమ్మల గుడి వీధిలో ఉన్న పోలేరమ్మ అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జానపద కళా రూపాలు ప్రదర్శించారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్ రోడ్డులో ఆర్ఐటి వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన జగడం నూకరాజు(40) భార్యతో సత్యవేణితోకలిసి బైక్‌పై వెళ్తున్నారు. ఆర్ఐటి వద్దకు వచ్చేసరికి సావిత్రి నగర్‌కు చెందిన దోమ సత్యం వేగంగా వచ్చి వీరి బైకును ఢీకొన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి తెలిపారు.

శ్రీరామచంద్రమూర్తి మరణం తీరని లోటు


ప్రజాశక్తి - తాళ్లరేవు

డిసిసిబి మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్రమూర్తి మరణం తీరని లోటని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. కీ.శే.ఎన్టీ రామారావు హయాంలో ఏకగవాక్ష విధానంలో ఆకాశం శ్రీరామచంద్రమూర్తి తూర్పుగోదావరి జిల్లా (డిసిసిబి) చైర్మన్ గా విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారని తెలిపారు. ఆయన గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పోతుల సుధాకర్ ఉన్నారు.

గోవలంక ఏటిగట్టుపై ప్రమాదం : నలుగురికి గాయాలు.

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం గోవలంక ఏటిగట్టుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. యానం నుండి జొన్నాడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి గోవలంక వద్ద ఏటిగట్టు పైనుంచి కిందకు జారింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు యానాం జి.జి.హెచ్. కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నైరోస్ టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆదిత్య ప్రిన్సిపాల్

'ఉద్యోగ గమ్యం చేరుకోవడం'పై శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో కాకినాడ నైరోస్ టెక్నాలజీస్ వారి సౌజన్యంతో "ఉద్యోగ గమ్యాన్ని చేరుకోవడం' అనే అంశం పై ఒకరోజు శిక్షణా తరగతిని ఆ కంపెనీ అధినేత మంగళం పల్లి పవన్ కుమార్ నిర్వహించారు. నవీనయుగంలో విద్యార్థులు తమ ఉద్యోగ గమ్యాన్ని త్వరగా ఎలా చేరుకోవడం, అందులోని మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆదిత్య ఇంజ నీరింగ్ కాలేజీ నైరోస్ టెక్నాలజీస్‌తో ఎంఒయు కుదుర్చుకుంది. శిక్షణాశిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, విభాగథిపతి ఎ. వానతి, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ తులసి మంగతాయారు

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని,ప్రతి విద్యార్థి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు విద్యార్థుళకు సూచించారు. స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో 10 వ తరగతి చదువుతున్న119 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఆమె తులసి మంగ తాయారు పంపిణీ చేశారు. శుక్రవారం కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాశీలవారి వీధిలోని వెలమ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ మంగతాయారు మాట్లాడారు. ఈ సందర్భంగా హై స్కూల్ అభివద్ధి కమిటీ చైర్మన్ అల్లు ప్రసాద్ మాట్లాడుతూ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతలు పప్పల బుజ్జి,యాళ్ల వీరబాబు,తైనాల శ్రీనులు ఈ సామగ్రిని సమకూర్చారన్నారు సమావేశంలో వైద్యాధికారి శిరీష, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, డైరెక్టర్లు లోవ కుమారి, లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు నూకరాజు, కమిటీ సభ్యులు బండారు సుధీర్ కుమార్, దుర్గాప్రసాద్, బొడ్డు రాజు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను విడిగా సేకరించాలి

- డిఎల్‌పిఒ వై అమ్మాజీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతీ గ్రామంలో తడిచెత్త పొడిచెత్తను వేరు చేసి కంపోస్టు తయారీ కేంద్రాలకు తరలించాలని కాకినాడ డివిజనల్ పంచాయితీ అధికారి వై అమ్మాజీ పిలుపునిచ్చారు. ఉండూరు గ్రామంలో ఎంపిక చేసిన లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం రెండో రోజు ఎంపిక చేసిన ఎఫ్‌కెపాలెం, చిత్రాడ తొండంగి, ఎవి నగరం గ్రామాలకు ఇన్‌చార్జి ఇవోపిఆర్డీ శ్రీహరి అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతుల్లో డిఎల్‌పిఒ అమ్మాజీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని చెప్పారు. శిక్షణకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది, తొండంగి ఇవోపిఆర్డీ ఎన్ సత్య ప్రసాద్, ఉండూరు గ్రామ సర్పంచి సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచి కొప్పిరెడ్డి రాధాకృష్ణ, గ్రామ కార్యదర్శులు కుమార్ రాజా, బుల్లియ్యకాపు, పంచాయితీల సిబ్బంది, క్లాపు మిత్రలు,తదితరులు మొత్తం 48 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తడిపొడి చెత్తసేకరణపై గ్రామంలో ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు.



రెండో రోజు శిక్షణకు హాజరైన పంచాయితీల సర్పంచిలు, సిబ్బంది

దళిత చైతన్య వేదిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి కుల మతాలకు అతీతంగా దళిత చైతన్య వేదిక చేస్తున్న సేవలు అభినందనీయమని రిటైర్డ్ ఎంఇఒ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత చైతన్య వేదిక పే బ్యాక్ టు ద సొసైటీ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వి.చక్రధర్‌రావు మాట్లాడారు. పరీక్ష సామగ్రి పంపిణీ హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, సమన్వయ కర్త బత్తుల జనార్ధనరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోడదాసు బాబురావు, ప్రముఖ అంబేడ్కర్ రచనల విశ్లేషకులు చిలకపాటి శ్రీధర్, ఉపాధ్యాయులు ఉప్పే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.